ఆదాయం మిన్న.. అభివృద్ధి సున్నా

సంజామల మండలం ఆకుమల్లలోని ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాలకు 60 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. కౌలుకు ఇవ్వడం ద్వారా ఏటా లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. అయితే ఆలయాల నిర్వహణను మాత్రం అధికారులు గాలికొదిలేశారు. ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా కన్నెత్తి చూడడం లేదు. గుడి చుట్టూ కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ప్రహరీ లేకపోవడంతో పందులు, కుక్కలు వస్తున్నాయి. దుర్గంధం వ్యాపిస్తుండడంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

- ఆకుమల్ల ఆంజనేయస్వామి, చెన్నకేశవ స్వామి ఆలయాలకు 60 ఎకరాలు
- మాన్యం భూముల వేలంలో ఏటా రూ.లక్షల్లో ఆదాయం
- నిర్వహణను మాత్రం గాలికొదిలేసిన అధికారులు
- అపరిశుభ్రంగా ఆలయ పరిసరాలు


ఆకుమల్లలో అభివృద్ధికి నోచుకోని ఆంజనేయస్వామి ఆలయం,


మురుగు నీరు, చెత్తకుప్పలు

సంజామల: ఆకుమల్లలోని ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఆదాయం వస్తున్నా నిర్వహణ లోపంతో దుస్థితికి చేరుకుంటున్నాయి. ఆంజనేయస్వామి ఆలయానికి 40 ఎకరాలు, చెన్నకేశవ స్వామి ఆలయానికి 20 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. ఎకరా సుమారు రూ.15 నుంచి రూ.30 లక్షల వరకు విలువ చేస్తుంది. ఏటా కౌలుకు ఇవ్వడం ద్వారా రూ.11 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతోంది. ఇంత ఆదాయం వస్తున్నా దేవదాయశాఖ అధికారులు అధికారులు ఆలయ అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదు. 20 ఏళ్ల క్రితం ఆలయ పరిసరాలు ఎలా ఉన్నాయో ఇప్పుడు అలాగే దర్శనమిస్తున్నాయి. పర్యవేక్షణ, నిర్వహణ లోపంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఆలయ ఆవరణ పిచ్చి మొక్కలతో నిండిపోయాయి.

ఏటా రూ.11 లక్షలకుపైగా ఆదాయం

మాన్యం భూములు కౌలుకు ఇవ్వడం ద్వారా ఏటా రూ.11 లక్షలకుపైగా ఆదాయం సమకూరుతోంది. మాన్యం భూములకు ఎస్సార్బీసీ కాల్వలు అందుబాటులో ఉండడంతో నీటి సౌకర్యం ఉంది. ఆకుమల్లలో ఎండు మిర్చి అధికంగా సాగు చేస్తుంటారు. మాన్యం భూములకు నీటి సౌకర్యం ఉండడంతో కౌలుకు తీసుకోవడానికి రైతులు పోటీపడుతుంటారు. మూడేళ్లకోసారి మాన్యం కౌలుకు వేలం వేస్తుంటారు. మాన్యం భూములకు పోటీ ఎక్కువగా ఉండడం వల్ల అధిక ధరకే దక్కించుకుంటుంటారు. అయితే అధికారులు తక్కువగా వేలం వేసినట్లు చూపిస్తూ నిధులు పక్కదారి మళ్లిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

గుడి చుట్టూ చెత్తకుప్పలు

ఆంజనేయ స్వామి ఆలయం చుట్టూ మురుగు నీరు నిల్వ చేరడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గుడి పక్కనే మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. గుడి చుట్టూ కంపచెట్లు, పిచ్చిముక్కలు పేరుకుపోయాయి. కనీసం వాటిని కూడా తొలగించడం లేదని భక్తులు పెదవి విరుస్తున్నారు. ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

రైతుల ఆవేదన

2023–24 సంవత్సరానికి సంబంధించి దేవాలయ భూములను కౌలుకు తీసుకున్న రైతులు వర్షాభావ పరిస్థితులతో నష్టపోయారు. కౌలులో రాయితీ కూడా కల్పించలేదు. ఎంత మొత్తం వేలం పాడారో అంత మొత్తాన్ని చెల్లించాలని స్పష్టం చేశారు. దీంతో కౌలు మొత్తాన్ని చెల్లించారు. ఇందులో పెట్టే శ్రద్ధ ఆలయ నిర్వహణపై పెడితే బాగుంటుందని స్థానికులు, రైతులు హితవుపలుకుతున్నారు.

పంట నష్టం వచ్చినా కౌలు చెల్లించాం



ఎకరా రూ.26 వేల చొప్పున 5 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. గత ఏడాది వర్షాలు లేకపోవడంతో పంట నష్టపోయాం. నష్టం వచ్చిన విషయం అధికారులకు తెలియజేశాను. ఈ సంవత్సరం కౌలు తగ్గించాలని కోరాను. కానీ అలా కుదరదు కౌలు మొత్తం చెల్లించాల్సిందేనని అధికారులు తెలిపారు. నా లాగే గత ఏడాది మాన్యం భూములు కౌలుకు తీసుకున్న రైతులు నష్టపోయారు. అధికారులు స్పందించలేదు. ఆలయాల అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదు.

–మాహేశ్వర్ రెడ్డి, రైతు ఆకుమల్ల

ప్రహరీ నిర్మిస్తాం



ఆలయం చుట్టూ గ్రామస్తులు చెత్త వేస్తున్నారు. మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. త్వరలో కాంపౌండ్ వాల్ నిర్మిస్తాం. ఎప్పటికప్పుడు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. అర్చకునికి నెలకు రూ.20 వేలు జీతం అందిస్తున్నాం. మిగిన మొత్తాన్ని దేవాలయానికి ఖర్చు చేస్తున్నాం.

–చంద్రుడు, అంజేయస్వామి ఆలయ ఈఓ, ఆకుమల్ల


ఆలయంలో ప్రదక్షిణలు చేసే దారిలో పిచ్చిమొక్కలు

క్లుప్తంగా

సత్ప్రవర్తనతో మెలగాలి


ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: వివిధ కేసుల్లో జైలు జీవితం గడుపుతున్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. పట్టణంలోని సబ్ జైలులో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఆర్థిక స్తోమత లేక స్వతహాగా న్యాయవాదిని నియమించుకోలేని వారికి ప్రభుత్వమే న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవిస్తున్న వారు తమ తప్పులను తెలుసుకుని ఇతరులతో మంచిగా మెలగాలని సూచించారు. అనంతరం జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డితో కలిసి జైలు పరిసరాలను పరిశీలించారు. భోజన వసతి, వైద్య సేవలపై ఆరా తీశారు. న్యాయవాది మధు, కోర్టు సిబ్బంది సరిత, ఇందిర, కళ్యాణి ఉన్నారు.

బదిలీ సన్మానం


కమిషనర్ రమేష్ బాబును సత్కరిస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

బేతంచెర్ల: ప్రజలకు అందించే సేవ ద్వారానే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు ఆత్మకూరు మున్సిపాలిటీకి బదిలీ కావడంతో శనివారం వీడ్కోల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ రమేష్ బాబును చైర్మన్ చలం రెడ్డి, వైస్ చైర్మన్లు నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్, వార్డు కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. వార్డు కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, మధు, షేక్ ముబీనా, ఆదిలక్ష్మి, సుశీలమ్మ, యంగమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసరా మహోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం తెలిపారు. వచ్చే నెల 6వ తేదీ అమ్మవారి శాల ఆవరణలో భగవద్గీతలోని మొదటి అధ్యాయం 20 శ్లోకాలపై పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ. 2,500, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 2వేలు, రూ. 1500 ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 9573313805, 9014473208 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహించిన ద్రోణాచలం సేవాసమితి సభ్యులు

ప్యాపిలి: పట్టణానికి చెందిన నాగలక్ష్మి (75) అనే వృద్ధురాలు శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థానికులు ముందుకు రాలేదు. సమాచారం అందుకున్న డోన్‌కు చెందిన ద్రోణాచలం సేవాసమితి సభ్యులు ప్యాపిలికి చేరుకుని మృతురాలికి అంత్యక్రియలు నిర్వహించారు. వృద్ధురాలి అంత్యక్రియలకు అయిన ఖర్చులను ప్రొద్దుటూరు, మల్యాలకు చెందిన తేజ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి భరించారు. డోన్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రాజయ్యగౌడ్ వైకుంఠరథం ఏర్పాటు చేశారు. సభ్యులు షాదీఖానా రాజా, గురుస్వామి, తాహీర్‌బాషా, సుధాకర్, రసూల్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సన్మానం

ప్యాపిలి: మండల పరిధిలోని ఏనుగుమర్రి ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజిక్స్ ఉపాధ్యాయిని షకీలాసోనిని ఎస్టీయూ నాయకులు శనివారం సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వెంకట్‌నాయక్, చిన్నప రెడ్డి, హాజీమస్తాన్ వలి, చంద్రమౌళి, కిరణ్‌కుమార్, పవిత్రన్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలి

బేతంచెర్ల: జాతీయ జనగణనకు ముందే ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజాంబేగ్ కోరారు. శనివారం బేతంచెర్ల ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.

స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో తొలగించిన స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మధుశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. నాలుగేళ్లుగా ప్రభుత్వాస్పత్రిలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న స్వీపర్లను తొలగించడం దుర్మార్గం అన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే జీతాలెందుకు?


విద్యుత్ శాఖ రూరల్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

డోన్: ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం నుంచి జీతాలు ఎలా తీసుకుంటారని కలెక్టర్ రాజకుమారి విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని అవులదొడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక బహిరంగ సభలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డితో పాటు కలెక్టర్ రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మద్దిరెడ్డితో పాటు పలువురు గ్రామస్తులు విద్యుత్ అధికారులపై ఫిర్యాదు చేశారు. గ్రామంలో విద్యుత్ పోల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకొచ్చినా పట్టించుకోలేదని కలెక్టర్ వద్ద వాపోయారు. దీంతో రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపాటి సమస్యలు కూడా పరిష్కరించకుంటే ఉద్యోగాలు ఎందుకు చేయాలని నిలదీశారు. అసలు ఉద్యోగం చేస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. దీంతో కంగుతిన్న ఏఈ త్వరలోనే కొత్త పోల్స్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్‌కు సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

కట్టడమెందుకో.. కూల్చడమెందుకో!


పాతబస్టాండ్ ఫ్లైఓవర్ కింద నిర్మాణాన్ని కూల్చివేసిన దృశ్యం

డోన్: ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయ లోపంతో లక్షలాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరవుతోంది. 2018లో పట్టణ సుందరీకరణలో భాగంగా రూ.10లక్షలతో 1.25 కిలో మీటర్ల పొడువుగల ఫ్లైఓవర్ కింద పార్కు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం అనేక కట్టడాలను నిర్మించారు. అప్పటి తెలుగుదేశం పార్టీ పాలక వర్గం ఫ్లైఓవర్ కింద దుకాణాలు ఏర్పాటు చేసేందుకు చిరు వ్యాపారుల వద్ద నుంచి బ్యాంకు డీడీల రూపంలో రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేశారు. పెద్దఎత్తున విమర్శలు రావడంతో అప్పటి మున్సిపల్ పాలకవర్గ ముఖ్య సభ్యులు చిరువ్యాపారుల నుంచి సేకరించిన బ్యాంకు డీడీలను వెనక్కు ఇచ్చేశారు. అప్పటి నిర్మాణాలను ఇప్పుడు ట్రాఫిక్ సమస్య పేరుతో తిరిగి పోలీసులు కూల్చివేస్తున్నారు. ఈ కూల్చివేతకు తమకు ఎలాంటి సంబంధం లేదని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా పోలీసులు స్వయంగా కూల్చివేతలను ప్రారంభించారని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. సాధారణ నిధుల కింద పన్నుల రూపంలో ప్రజల నుంచి సేకరించిన సొమ్ముతో ముందుచూపు లేకుండా కట్టడాలను నిర్మించడం, తిరిగి అదే సుందరీకరణ పేరుతో కూల్చివేయడం చూసి ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఏటా పెరుగుతున్న జనాభా, ద్విచక్ర వాహనాల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్, పోలీసు యంత్రాంగాలు సమన్వయంతో పనిచేయకపోవడంతో ఇలాంటి దుస్థితి నెలకొంది. ఇకనైనా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా పోలీసు, మున్సిపల్ అధికారులు భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ నియంత్రణ కోసం చర్యలు చేపడితే సమంజసంగా ఉంటుందని పట్టణ ప్రజలు సూచిస్తున్నారు.

తాగినోళ్లకు.. తాగినంత

- అక్టోబర్ నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు
- నియోజకవర్గంలో రెండు దుకాణాలు పెరిగే చాన్స్
- ఇప్పటికే గ్రామాల్లో పెరిగిన బెల్ట్‌షాపులు

కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వం పుణ్యమా అని ఇకపై తాగినోళ్లకు తాగినంత అన్నట్లు మారనుంది. అక్టోబర్ నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీని తీసుకొచ్చి లాటరీ పద్ధతిలో ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు ఏర్పడ్డాయి. ఏ గ్రామంలో చూసినా బహిరంగంగానే మద్యం విక్రయాలు చేస్తున్నారు. కూల్‌డ్రింక్ షాపులు, హోటళ్లలో మద్యం ప్రియులు ఇష్టారాజ్యంగా మద్యం సేవిస్తున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రస్తుతం 23 మద్యం దుకాణాలు ఉండగా అదనంగా రెండు దుకాణాలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం మరో వైపు పర్మిట్ రూములు ఏర్పాటు చేయనుంది. ఇదే కనుక జరిగితే ఎక్కడ పడితే అక్కడ మద్యం విచ్చలవిడి కానుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్య నియంత్రణ చేసేందుకు మద్యం ధరలను పెంచడంతో పాటు దుకాణాలను పరిమితం చేస్తూ వచ్చారు. బహిరంగ మద్యం విక్రయాలకు చెక్ పెడుతూ వచ్చారు. తాజాగా సెబ్ వ్యవస్థను రద్దు చేసి పాత పద్ధతిలోనే ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించారు.

బనగానపల్లె నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాలు

మండలం	దుకాణాల సంఖ్య
కొలిమిగుండ్ల	03
అవుకు	02
సంజామల	05
కోవెలకుంట్ల	05
బనగానపల్లె	08

క్వార్టర్ మద్యం రూ.99కే

కొత్త ఎక్సైజ్ పాలసీ ప్రకారం 180 ఎంఎల్ మద్యం బాటిల్‌ను రూ.99కే అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. తక్కువ ధరకు మద్యం విక్రయాలు చేస్తే మద్యం ప్రియులు పూర్తిగా బానిసలవుతారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త పాలసీ అక్టోబర్ మొదటి వారం నుంచి అమల్లోకి రానుంది. రెండేళ్ల కాలవ్యవధిలో లాటరీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు మద్యం దుకాణాలు కేటాయించనున్నారు. దరఖాస్తు ఫీజు రూ.2లక్షలుగా నిర్ణయించారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 వరకు దుకాణాలు తెరిచి ఉంచనున్నారు. జనాభా ప్రాతిపదికన మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచేందుకు కసరత్తు చేస్తున్నారు. దుకాణాలను దక్కించుకునేందుకు కూటమి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

అవుకు: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని అవుకు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మందా గుర్రమ్మ, ఉప సర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి అన్నారు. శనివారం అవుకులోని పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశుభ్రమైన గ్రామాలకు పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని సూచించారు. గ్రామస్తులు ఎక్కడపడితే అక్కడ చెత్తపడేయకుండా సహకరించాలని కోరారు. అందరి సహకారంతోనే స్వచ్ఛ గ్రామం సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం కార్మికులకు గ్లౌజులు, క్యాప్, సేఫ్టీ జాకెట్‌లను అందజేశారు.

నవయుగ వైతాళికుడు గురజాడ

డోన్ టౌన్: సమాజంలో బాల్య వివాహాలను రూపుమాపి తన రచనలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన గురజాడ అప్పారావు నవయుగ వైతాళికుడని హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, తెలుగు టీచర్లు దేవేంద్రప్ప, లీలావతమ్మ అన్నారు. గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని శనివారం పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆయన చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయన రచించిన పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, కన్యాశుల్కం, దేశమును ప్రేమించుమన్నా గేయాన్ని విద్యార్థులతో పాడించి ఆయన జీవిత చరిత్రను వివరించారు. అలాగే రోకలి బండ హైస్కూల్‌లో ఎంఈఓ–2 రామనరసప్ప, సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ గురజాడ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మాణిక్యం శెట్టి, శ్రీనివాసులు, సుధాకర్ పాల్గొన్నారు.

24న మండల స్థాయి క్రీడా పోటీలు

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 24న మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల నుంచి అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. ఉత్తమ ప్రతిభ చూపే వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు

ప్యాపిలి: రోడ్లపై ఆవులు, గేదెలు, ఇతర జంతువులను విచ్చలవిడిగా వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పశువుల యజమానులు వాటిని తమ ఇంటి ఆవరణలో కట్టి ఉంచుకోవాలన్నారు. రోడ్లపై వదిలితే ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గోశాలకు తరలిస్తామని స్పష్టం చేశారు.

రాయితీపై ఎరువులు

బనగానపల్లె రూరల్: జాతీయ ఆహార భద్రత పథకం కింద మండలంలోని పసుపల గ్రామంలో కంది పంట సాగు చేసిన రైతులకు 50 శాతం రాయితీతో ట్రైకోడెర్మావిరిడి అందజేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే పురుగు మందులు, తెగుళ్ల నివారణ మందులను సబ్సిడీపై అందజేస్తామన్నారు. శనివారం పసుపల గ్రామంలో కంది పంటను ఆయన పరిశీలించారు. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వాహనాలకు జరిమానా


బస్సు రికార్డులను పరిశీలిస్తున్న ఆర్టీఓ క్రాంతికుమార్

డోన్ రూరల్: మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై ఆర్టీఓ క్రాంతి కుమార్ శనివారం వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డు ట్యాక్స్, లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురికి జరిమానా విధించారు. అలాగే నాగలాండ్ రాష్ట్రం, కొహిమాకు చెందిన ట్రావెల్ బస్సు హైదరాబాద్ నుంచి పులివెందులకు వెళుతుండగా రికార్డులను పరిశీలించారు. రోడ్డు ట్యాక్స్ చెల్లించకుండా నడుపుతుండడంతో రూ.4,56,500 జరిమానా విధించినట్లు ఆర్టీఓ తెలిపారు. బస్సును సీజ్ చేసి ఆర్టీసీ బస్టాండ్‌కు తరలించారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

బేతంచెర్ల: డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన బోయ హరీష్ ఈ నెల 11న బేతంచెర్లకు వచ్చి తిరిగి వెళ్తుండగా మండల పరిధిలోని ఆర్.కొత్తపల్లె గ్రామ సమీపంలో పాల వ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బోయ హరీష్ తలకు, కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ ఉస్మాన్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

అవుకు: మద్యానికి బానిసయ్యాడని ఇంట్లో మందలించడంతో ఆత్మహత్యకు యత్నించిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసుల వివారాల మేరకు.. అవుకు మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన తలారి ప్రశాంత్ (21) పలువురి వద్ద అప్పులు చేశాడు. మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 11వ తేదీ ఎస్సార్బీసీ కాలువ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని తండ్రి తలారి గంగులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, కార్మికులు


కొలిమిగుండ్ల: పిచ్చిమొక్కలను తొలగిస్తున్న అధికారులు

బనగానపల్లె: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు అన్నారు. శనివారం స్వచ్ఛతా హి పక్షోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రధాన రోడ్లలో ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనున్న పార్క్‌లో పారిశుద్ధ్య కార్మికులతో పిచ్చిమొక్కలను తొలగించారు. పారిశుద్ధ్య కార్మికులకు చేతి గ్లౌజ్‌లను పంపిణీ చేశారు. వెలుగు ఏపీఎం తిరుపాల్‌రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ హరికృష్ణ, ఎంఈఓ శ్రీనివాసులు, పంచాయతీ ఈఓ హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో శ్రమదానం

కొలిమిగుండ్ల: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం కొలిమిగుండ్లలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు శ్రమదానం చేశారు. ఎంపీడీ, ఎమ్మార్వో, తహసీల్దార్ కార్యాలయాల పరిసరాల్లో పిచ్చిమొక్కలు, కంపచెట్లను తొలగించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, ఈఓఆర్డీ శ్రీహరి, సర్పంచ్ శివరాముడు, ఉద్యోగులు చెత్తను శుభ్రం చేశారు.


డోన్ కొత్తబస్టాండ్ సమీపంలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

డోన్: ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వ చేరడం, పిచ్చిమొక్కలు పెరగడం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతున్నాయని మున్సిపల్ కమిషనర్ జయరాం అన్నారు. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని కొత్తబస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రధాన రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంతో ఉండగలుగుతామన్నారు. మున్సిపల్ డీఈ రసూల్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాగునీటి ఉద్యమ నేత మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన సాగునీటి ఉద్యమ నేత కామని వేణుగోపాల్‌రెడ్డి మృతికి శనివారం పలువురు నాయకులు, సాగునీటి ఉద్యమ నేతలు నివాళులర్పించారు. శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో కామని మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీవీ ప్రసాదరెడ్డి, రాయలసీమ సాగునీటి ఉద్యమ నేతలు బొజ్జ దశరథరామిరెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, న్యాయవాదులు నరసింహ, శ్రీనివాసులు, ఉదయ్, ప్రేమ్‌నాథ్, సీపీఎం నేత సుధాకర్, వివిధ సంఘాల నాయకులు బందెల ఓబులేసు, పల్లె నరసింహారెడ్డి, ఆవుల దేవరత్నం, కరీంబాషా, సహదేవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, లింగన్న తదితరులు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఇష్టారాజ్యంగా బరమ్ తవ్వకం


శివవరం–ఆకుమళ్ల రహదారిలో బరమ్‌ను తవ్విన దృశ్యం

అవుకు: మండల పరిధిలోని శివవరం–ఆకుమళ్ల రహదారిలో కొందరు ఇష్టారీతిగా బరమ్‌ను తవ్వి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఆకుమళ్ల గ్రామం నుంచి శివవరం మీదుగా బనగానపల్లెకు వెళ్లే రహదారి సరిగ్గా లేక ఏళ్ల తరబడి గ్రామస్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యేక చొరవ తీసుకుని తారు రోడ్డుతో పాటు రోడ్డుకు ఇరువైలా గ్రావెల్‌తో బరమ్‌ను ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వం మారిన తరువాత సంజామల మండలం ఆకుమళ్ల గ్రామానికి చెందిన కొందరు తమ స్వార్థం కోసం శివవరం గ్రామ సమీపంలో నాలుగు రోజుల క్రితం అనుమతి లేకుండా బరమ్ తవ్వడానికి ప్రయత్నించగా స్థానిక రైతులు అడ్డుచెప్పడంతో వెనుదిరిగారు. గురువారం అర్ధరాత్రి ఎవరూ చూడని సమయంలో బరమ్‌ను తవ్వి పైప్‌లైన్ ఏర్పాటు చేసి కప్పేసారు. విషయం తెలుసుకున్న రైతులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఇలా చేయడం వల్ల రోడ్డు పక్కన గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైతులు వాపోయారు.

నూతన కార్యవర్గం

డోన్ టౌన్: ఎల్ఐసీ ఏజెంట్ల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. పట్టణ సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా గోసానిపల్లెకు చెందిన శ్రీరాములు, కార్యదర్శిగా మాకం ప్రసాద్ ఎన్నికయ్యారు. వీరితో పాటుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.